

పొయిట్రీ కేఫ్





“జ్ఞాపకాల్ని దాచిపెట్టు. మూత తీస్తే అట్లా మంత్రపు పొగలా బయటకు వస్తూనే ఉంటాయి. డెస్క్‌పై కూర్చుని ఉన్నంతసేపూ వాటిని ముట్టుకోవద్దు. అట్లాగే వార్తలను అందంగా చెప్పాలని ప్రయత్నించకు. అద్భుతంగా రాయాలనిపించి మధ్యమధ్యలో రహస్యాల్ని పొదుగుతావు. ఉద్వేగం కోసం కొంచెం ఫిక్షన్, కొంచెం మెలోడ్రామా కలుపుతావు. చివరకు వార్తల బదులు రంగుల దృశ్యం తయారవుతుంది. అందులో అన్నీ ఉంటాయి గానీ నిజమే తక్కువగా ఉంటుంది. వార్తల్ని సెన్సేషన్ చెయ్యాలనే తపన నీ దృష్టిని మసక బారుస్తుంది.”

శనివారం మధ్యాహ్నం హుషారైన ఆదివారాన్ని కలకంటుండగా ఎడిటరుగారు పిలిచారని కబురు వచ్చింది. ఎడిటరు సత్యప్రకాష్‌కి యాభై దాటి ఉంటాయి. పసుపుపచ్చ ఛాయ. పొడవైన మనిషి. విశాలమైన భుజాలు. ముడతలు పడి వడిలిపోయిన ముఖం. ఆయన ముఖం చూస్తుంటే బాగా మగ్గిపోయిన టమోటా పండు గుర్తుకొస్తుంది. పండు కుళ్ళటం ఇప్పుడే మొదలైందనిపిస్తుంది.

“నువ్వు రాసిందేనా ఈ న్యూస్ స్టోరీ?” అంటూ ఆదివారం అనుబంధంలో నేను రాసిన ‘సామూహిక మరణాల దేశం’ అనే వ్యాసాన్ని ముందుకు తోశాడు. “నీ సర్వీసెంత?” అని ప్రశ్న వేసి, ఆయనే “బహుశా మూడు నెలలో, నాలుగు నెలలో” అంటూ, “రాత్రికి రాత్రి గొప్ప జర్నలిస్టువైపోవాలనా?” విసుగ్గా ఉన్నాడాయన. “నీ స్వంతమేనా? ఎక్కడన్నా ‘లిఫ్ట్’ చేసిన బాపతా?” అని నా కళ్ళలోకి చూశాడు. “లేదు. నేను రాసిందే.” తడబడుతూ చెప్పాను. అదుగో ఆ తరువాత సుదీర్ఘమైన ఉపన్యాసం మొదలుపెట్టాడు.

అందరూ నన్ను గుర్తించాలని, మిఠతా సబ్‌ల కంటే ఎక్కువగా పేరు తెచ్చుకోవాలని నా ఆరాటం. ఈ ఆర్టికల్‌కు మూలం మోహన సుందరం అనే వ్యక్తి రాసిన “రాయలసీమ ఫ్యాక్షన్ గ్రూపులు - దళిత సమస్యలు” అనే సిద్ధాంత వ్యాసం, ఆ మనిషిని ఒకసారే కలిశాను. ఆ ఒక్క పరిచయంలోనూ అతను అద్భుతాలు చేసే మనిషిలా కనపడ్డాడు గానీ మామూలు మనిషిలా తోచలేదు. అడక్కుండానే అతను రాసిన నోట్సు నాకిచ్చి అదృశ్యం అయిపొయ్యాడు. ‘వేంపెంట’ మారణహోమం తరువాత టైమ్లీగా ఉంటుందని ఆ సిద్ధాంత వ్యాసాన్ని అక్కడక్కడా మార్చి న్యూస్‌స్టోరీగా రాశాను.

“వేంపెంట ఎప్పుడు వెళ్ళేవు?”

నేను నీళ్ళు నమిలాను.

"రాయలసీమ గురించి ఇంత గొప్ప అధ్యయనం ఎప్పుడు చేశావు? ఫ్యాక్షనిస్టులను పాతకాలపు పాలెగాళ్ళతో పోల్చటం, రెడ్లకు, కమ్మవారికి మధ్య కుల పోరాటం, పొలిటికల్ మాఫియాలు, పీపుల్స్‌వార్, ప్రతిఘటనల కార్య కలాపాల ఈ వివరాలన్నీ ఎప్పుడు సేకరించావు?"

నా వళ్ళంతా చెమటలు పట్టాయి. "మోహనసుందరం అని నా స్నేహి తుడు, కర్నూలు కుర్రాడు. ఈ గొడవలన్నీ తెలిసినవాడు అతని సహాయం తీసుకొన్నాను" సమయానికో అబద్ధం ఆడాను.

"వేంపెంట సంఘటన తరువాత వారంరోజుల దాకా ఏం జరిగిందనే వార్తలు ఎవరికీ తెలియలేదు. నువ్వు బాక్స్‌లో ఇచ్చిన సమాచారం ప్రకారం రెండో రోజో, మూడో రోజో ఆ వూరు వెళ్ళినట్లు. అక్కడో ప్రైవేట్ ఆర్మీ రూల్ చేస్తుందనీ అనుకోవాలి. ఇందులో నిజం ఎంత?" అంటూ సండే సప్లిమెంట్ నా ముందుకు తోశాడు. చాలాచోట్ల ఎర్ర సిరాతో అండర్‌లైన్ చేసి ఉంది.

"అండర్‌లైన్ చేసిన వాక్యాలు, ఒకసారి చదువు! అవి నిజాలో, కల్పనో చెప్పు" శీర్షికతో సహా సగానికి పైగా ఎర్రటి గీతలున్నాయి. అండర్‌లైన్ చేసిన వాక్యాల్ని మరోసారి చదవటం మొదలుపెట్టాను.

పక్షులు ఎగరడాన్ని నిషేధించిన ఊరు.

గ్రామంలో కనబడని భయం. అందరు కలిసి ఒక రహస్యాన్ని మోస్తు న్నట్లుగా. తగలబడిన ఇళ్ళలోంచి ఇంకా సెగలు వస్తున్నాయి. ఆ ఇళ్ళలోంచి లేచిన బూడిద. రయ్యి రయ్యిమని రేగే గాలికి, మంత్రపు పొగలా లేచి ఊరం తటిని చుట్టుముడుతుంది. రోడ్డుపై చాలామంది జనం మూగున్నారు. చాలా మంది చేతుల్లో మారణాయుధాలున్నాయి. వాళ్ళ ముఖాలు వింతగా ఉన్నాయి. సగం తెగిన తలల్ని బలవంతంగా మెడలపై నిలబెట్టి నడుస్తున్నట్లుగా ఉన్నారు. ఊరంతా ఒకానొక క్షణం దగ్గర ఆగిపోయినట్లుగా. ఆ క్షణం నిన్ననో, మొన్ననో, లేదా చాలా ఏళ్ళ క్రితమో?

టోపీలు, బెల్టులు ఊడతీసుకొని, బట్టలు లూజు చేసుకొని, విరామం గా కూర్చున్న పోలీసులు, పులి, మేక, పేకాటలాంటి క్రీడోత్సవాల్ని క్షణంపాటు పక్కనపెట్టి మావైపు అసహనంగా చూశారు.

"వివరాలన్నీ చెప్పాం కదా. మళ్ళీ ఎందుకొచ్చారు? ఎందుకండీ మా ప్రాణం తీస్తారు? మనుషులు కనిపిస్తే చాలు కరిచేలాగున్నారు ఊర్లోవాళ్ళు. ఎంతమందికని ప్రొటెక్షన్ ఇవ్వగలం మేము?"

"అయిదు నిమిషాలు. ఇంటర్వ్యూలు ఏమి చెయ్యం. జస్ట్ ఊరిని చూసొస్తాం."

"కెమెరాలు, బ్యాగులు ఇక్కడ పెట్టి వెళ్ళండి. ఒక్కొక్కళ్ళే వెళ్ళండి."

రెండు మూడు వీధులు దాటగానే ఏదో నాటకంలో సన్నివేశంలా నలుగురు మనుషులు నన్ను చుట్టుముట్టారు. నా మెడపై చెయ్యి వేసి ముందుకు తోశారు. అట్లా త్రోసుకొంటూ వెళ్ళి ముతకవాసన వేసే ఇరుకైన చీకటిగదిలో త్రోశారు. అది గదో పాతాళమో అర్థం కాలేదు. ఒక్కరవ్వ వెలుతురైనా చొరబడకుండా గదుల్నెట్లా కట్టగలుగుతారా అని ఆశ్చర్యపోయ్యాను.

కాసేపటికి 'బోర్జిస్' కథలలోలాగా చీకటి గదిలోకి ఒక ప్రశ్న వెయ్యబడింది.

"ఎవురు నువ్వు?"

వివరాలు చెప్పాను.

ఆ తరువాత చాలాసేపు నిశ్శబ్దం. భయంకరమైన హింసను ఊహించుకొంటూ గదిలో కూలబడ్డాను.

సాయంకాలం అయింది. గదిలోని చీకటి మరింతగా గడ్డ కట్టింది. నాలో వింత ఆందోళన. 'ఎందుకింత ఆలస్యం? త్వరగా టార్చర్ చెయ్యరేం?'

చీకటిబడ్డాక గదిలోంచి బయటకు తీశారు. "ముందూ, ఎనకా సూడకుండా నేరుగా ఎల్లిపో. ఎవుడితో మాట్లాడబాక" అంటూ వార్నింగ్ ఇచ్చారు.

హోటల్ దగ్గర ఆగాను. చిన్న పూరిపాక. ఆకలిగా ఉంది. హోటల్‌వాడు కంగారు పడుతున్నాడు.

"ఈడకు రావద్దు. ఎల్లిపోసామీ ఎల్లిపో." అంటూ దండం పెట్టాడు.

నేను నడుస్తుంటే తలుపు సందుల్లోంచి తొంగి చూస్తూ నాలుగైదు తలలు. బస్టాండు దగ్గర ఉదయం కనబడ్డ పోలీసు వ్యాను, పోలీసులు ఎవరూ లేరు. లెదర్ బాగ్, కెమెరా ఏమైనాయో తెలియదు.

నా వెనక అలికిడి. ఇద్దరు మనుషులు.

"కదలొద్దు! నిన్నేమి సెయ్యం!"

నా జేబులో పర్సు లాగేసుకొన్నాడు ఒకడు. ఇంకొకడు నా చొక్కా విప్పి, వేసుకొని చూసి, "మరీ లూజుగా ఉందిరా" అంటూ మళ్ళీ నా ముఖంపై విసిరేశాడు. పర్సులోంచి డబ్బులు తీసుకొని పర్సు మళ్ళీ నాపై విసిరారు.

పదడుగుల దూరంలో ఉన్న బండపై కూలబడ్డారు. మధ్యాహ్నం టౌన్ నుంచి వచ్చిన స్త్రీల నాయకురాల్ని ఎట్లా ఏడిపించింది కథలు కథలుగా చెప్పుకొంటున్నారు.

చెట్టు పైని పక్షుల క్వాక్ క్వాక్ చప్పుడుకి వాళ్ళు కబుర్లు ఆపారు. వాళ్ళలో ఒకడు కోపంగా క్యాట్‌బాల్ తీసుకొని పట్‌పట్ మంటూ కొట్టాడు. రెండు పక్షులు గిలగిలలాడుతూ నేలపై పడ్డాయి. నేలపై పడ్డ పక్షుల్ని చూసి పక్షుల్లో కలకలం లేసింది. గుంపుగా లేచి, ఒక్కసారిగా ఎగరటం మొదలు పెట్టాయి.

"ఏమిటిది? న్యూస్ రిపోర్టింగ్ అంటే ఇదేనా? కథో కవితో చదివి నట్లుంది గానీ - వార్తా కథనంలా లేదు. ఈ చివరి పేరా మరీ అన్యాయం!" అంటూ పేపరు నా చేతుల్లోంచి లాక్కొని చదవటం మొదలుపెట్టాడు. "ఇళ్ళనీ, మనుషుల్నీ తగలబెట్టినంత సులువుగా, సాక్ష్యాల్ని చెరిపివెయ్యటం సాధ్యమా? చనిపోతూ, చనిపోతూ వాళ్ళు, కళ్ళను, చెవులను పెరికి నేల పొడవునా వెద జల్లారు. సాక్ష్యమై వాళ్ళక్కడ జీవిస్తూనే ఉంటారు. ఆ సాక్ష్యాలు రేపటి కోసం పొలిమేరల దగ్గర ఎదురుచూస్తూనే వుంటాయి' ఇంత తలతిక్క వాక్యం ఇంకొకటి ఉంటుందా? కళ్ళు పెరికి నేలమీద వెయ్యటం ఏమిటి? సాక్ష్యాలు ఎదురు చూడటం ఏంటి? నువ్వీ పేపరు ఉద్యోగం మానుకొని కథల్లో, నవల్లో రాసుకొని బ్రతుకు."

నా ముఖంలో నెత్తురుచుక్క లేదు. ఒళ్ళంతా చెమటలు పట్టి శరీరం చల్లగా శవంలా అయ్యింది.

కాసేపటికి కోపం తగ్గినాక "మోహనసుందరం ఎవరు? నేనొకసారి చూడాలి!" అన్నాడు.

"కొన్నిరోజులుగా అతను కనబడటంలేదు. హఠాత్తుగా అదృశ్యమైనాడు. కనబడిన వెంటనే మీ దగ్గరకు తీసుకువస్తాను."

'సరే వెళ్ళు' అన్నట్లుగా నావైపు చూస్తూ "ఈ కవిత్వపు తెగులు మినహాయిస్తే మొత్తం మీద మంచి వ్యాసం యిది. కీప్ ఇట్ అప్." అన్నాడు. నిట్టూరుస్తూ బయటకు నడిచాను.

* * *

రైల్వే స్టేషన్లన్నీ సెంటిమెంట్ల కూడళ్ళని నా నమ్మకం. రైలు ప్రయాణం ఒక అపరిచితునితో చేసిన సుదీర్ఘ సంభాషణలా అనిపిస్తుంది. హైదరాబాద్ జనానికి లోకల్‌ట్రైన్‌లో వెళ్ళటం నామోషీ. నాకు మాత్రం అవి కదులుతున్న గృహాలనిపిస్తాయి.

ఒక రైలు ప్రయాణంలో పరిచయమైనాడు మోహన సుందరం.

సాయంకాలం అంతా బార్‌లో - ఇద్దరు కవులు, ఇద్దరు జర్నలిస్టులు, ఒక విప్లవవాది - మోతాదు ఎక్కువయి భుజాలకు రెక్కలు మొలిచాయి. మిగిలినవాళ్ళు బార్‌లోనో, కుదరకపోతే బారు మెట్ల దగ్గరో గడపడానికి నిర్ణయించుకొన్నారు. నేను మాత్రం నా రైల్వే గృహంలో రాత్రిని గడపడానికి సిద్ధపడ్డాను. పదకొండు గంటల రాత్రి. చలి, చీకటి. ఆత్మల కోసం ఎదురుచూసే పొడవాటి దేహంలా ట్రైను.

నేను దిగాల్సిన స్టేషను, దిగమని సైగ చేస్తున్నా, నాకు దిగే మూడ్ లేదు. ట్రైన్ ఆ స్టేషనులో చాలాసేపు ఆగింది. వెచ్చని ఇనుప గృహాన్ని వదిలి

వెళ్ళాలనిపించలేదు. ఈ ట్రైన్‌లో ఇట్లాగే భూమి చివరిదాక ప్రయాణం చెయ్యాలని కోరిక.

రెండు స్టేషన్ల తరువాత ట్రైనంతా ఖాళీ అయ్యింది. ముందు బోగీలో నుండి ఒక కుర్రాడు నావైపు నడుచుకొంటూ వచ్చాడు. వచ్చి నా ఎదురుగా ఉన్న సీట్లో కూలబడ్డాడు. అందమైన యువకుడు. లాల్చీ పైజామా. గుబురు గడ్డం, భుజానికి గుడ్డ సంచి. సంచిలోంచి పుస్తకం తీసి పెద్దపెద్దగానే చదవటం మొదలుపెట్టాడు. కొద్దిసేపటికి పుస్తకం పక్కనపెట్టి నన్ను పరిశీలించటం మొదలుపెట్టాడు. నావైపే చూస్తూ - అతని రెండు కళ్ళూ రెండు మైక్రోస్కోపుల్లా నావైపు చూస్తూ - తెరిచిన కిటికీలోంచి రయ్యిరయ్యిమని చల్లటిగాలి వీస్తుంది. "ఏమిటి భూమి చివరిదాకా ప్రయాణం చెయ్యాలని ప్రయత్నమా?" అన్నాడు. ఉలిక్కిపడి అతనివైపు చూశాను.

సన్నగా కన్నుగీటి "నా పేరు మోహనసుందరం! రీసెర్చిస్కాలర్‌ని. పేరా సైకాలజీ నా సబ్జెక్టు. నేను కవిత్వం కూడా రాస్తాను" అని, క్షణం ఆగి, చిరునవ్వు నవ్వి "విస్కీతోనో, ప్రియురాలి ముద్దుతోనో, లక్షల డబ్బులతోనో కాక సహజంగా రెక్కలు మొలిచినవాణ్ణి. నేనో నూతన మానవుడికి నమూనా." మళ్ళీ క్షణంసేపు ఆగి "ఎప్పుడయినా దిగులుతోనో, దుఃఖంతోనో ఉన్నప్పుడు నా దగ్గరకు రా. తడికళ్ళలో పువ్వులు మొలిపించగల మంత్రవిద్య నా దగ్గర వుంది. ఇదుగో నా అడ్రసు" అంటూ విజిటింగ్ కార్డు నా వడిలోకి విసిరాడు. అందులో రెండే వాక్యాలు. పొయిట్రీ కేఫ్, మోహనసుందరం.

"పొయిట్రీ కేఫ్ అంటే అదేమైనా తాజ్‌మహలా, వీధిపేరు, ఇంటి నెంబరు ఏమీ లేకుండా" స్వగతంలో అనుకోబోయి పైకే అనేశాను.

"పొయిట్రీ కేఫ్, మోహన సుందరం అని మనసులో అనుకొంటే, నీ కాళ్ళకు వీధులు తమను తాము పరిచయం చేసుకొంటాయి" చందమామ కథల్లోలాగా మాట్లాడుతున్నాడు. అతను, అతని రూపం, మాటలు అన్నీ విస్కీ తాలూకు చిత్తభ్రమ అని తీర్మానించుకొని, కిటికీవైపు తిరిగి కళ్ళు మూసుకొన్నాను.

"రాయలసీమ ఫ్యాక్షను గ్రూపుల మీద వర్క్ చేస్తున్నావు కదూ, నా థీసిస్ కాపీ ఇస్తాను. రిఫరెన్సులా ఉంటుంది" అంటూ బరువైన బైండు పుస్తకం నావైపు తోశాడు. ఆశ్చర్యమో, భయమో వింత అనుభూతి నన్ను చుట్టుముట్టింది. కనికట్టు ఇతగాడిదా, విస్కీదా అని తేల్చుకోలేకపొయ్యాను. అతనివైపు చూడకూడదని గట్టిగా నిర్ణయించుకొన్నాను.

రైలు మరో స్టేషనులో ఆగి, బయలుదేరింది. క్షణంసేపు దీపాలు మసకలు, మళ్ళీ జిగేలుమన్నాయి. పక్కన చూస్తే మోహనసుందరం లేడు. ఒక అందమైన స్త్రీ. లేత గులాబీ రంగు చీర. రంగుల స్వప్నంలా ఉంది. ఆ

అమ్మాయి కూర్చున్న సీటుపై బల్బు ధగధగమని వెలుగుతుంది. బయట గాఢంగా నల్లగా చీకటి.

ఆ అమ్మాయి కూర్చున్న చోటు నుంచి సన్నని ఏడుపు వినబడుతోంది. రైలు పట్టాల శబ్దం ఆగిపోయి, ఏడుపు ఒక్కటే వినపడుతున్నట్లుగా ఉంది.

"ఒంటరిగా కూర్చుని జ్ఞాపకాలన్నిటినీ బయటకు లాగుతున్నావా?" ఇందాకటి ఆసామి మోహనసుందరం గొంతు. వెనక సీట్లో కూర్చున్నట్లున్నాడు. పౌరాణిక సినిమాల్లోలాగా హఠాత్తుగా ఆమె ముందు ప్రత్యక్షం అయ్యాడు.

"జీవితమంతా బందీలుగా ఉన్నామనే విషయం ఆలస్యంగా అర్థమవుతుంది. మనుషులకో, ఉద్యమాలకో, నినాదాలకో, పశ్చాత్తాపాలకో, కోరికలకో - జరిగిపోయిన ఆలస్యం గురించి ఇట్లా బోరుబోరుమని ఏడుస్తూనే ఉంటాం."

ఆ అమ్మాయి కూడా క్షణంపాటు దిమ్మెరపోయింది. ఆమె ఆశ్చర్యాన్ని పట్టించుకోకుండా "చెప్పండి. మీ దిగులునీ, దుఃఖాన్నీ నాతో చెప్పండి. నా పేరు మోహనసుందరం. సైకాలజిస్టును. సోషల్ సైంటిస్టును. మనసులూ, మనుషులూ నా సబ్జెక్ట్లు" అన్నాడు.

చాలాసేపు మౌనం తరువాత, ఆ అమ్మాయి పెదవి విప్పింది. "నా పేరు మాలతి. శుభోదయం పత్రికలో పనిచేస్తున్నాను. రెండు నెలల క్రితం సినిమా స్టూడియోలో బాంబు పేలుడు జరిగినప్పుడు, బాంబు ముక్క నా కుడిరొమ్ముకు తగిలి, సగానికి తెగిపోయింది. డాక్టర్లు ఆపరేషన్ చేశారు. రొమ్ము స్థానంలో ఇప్పుడో పొడవాటి స్కార్ అక్కడ ఉంది. నా చుట్టూ సానుభూతి కుప్పలు. ఈ సానుభూతులు చూసినప్పుడల్లా - ఇది రొమ్ము కాదని మృత్యువు నివసిస్తున్న ఇల్లని అనిపించి భయంతో వణికిపోతాను."

"ఏదీ చూడనివ్వండి"

ఆ అమ్మాయి ఉలిక్కిపడింది.

"ఏదీ చూడనివ్వండి" మళ్ళీ అడిగాడు.

ఆ అమ్మాయి విస్తుబోయింది. ఈ మాంత్రికుడు మోళీ కడుతున్నాడనిపించింది. ఆ అమ్మాయి పైట తొలగించి, జాకెట్ విప్పి -

తెల్లటి పాలనురగ లాంటి చర్మంపై పొడవుగా, నిలువుగా రాగిరంగులో మచ్చ. ఆపరేషన్ తాలుకు గుర్తు! అతనా మచ్చను నిమిరి, మెల్లగా, మృదువుగా ఆ మచ్చపై ముద్దు పెట్టుకొన్నాడు.

ఆ అమ్మాయి నోరు తెరుచుకొని అట్లాగే చూస్తుంది.

"మీరింక ఆనందంగా గడపండి. మీ దుఃఖాన్ని, అవమానాన్ని నేను తీసుకొన్నాను. కలల్ని, తీయని పాటల్ని మాత్రం మీలో ఉంచాను. ఆ ఎదురుగా

కూర్చున్న కుర్రవాడిలా మీకూ రెక్కలు మొలిచాయి. రెక్కలున్న మానవులు మీరు. స్వేచ్ఛగా ఎగిరిపొండి."

ట్రైన్ చివరి హాల్ట్ వచ్చేసింది. ఎక్కడ నుంచో రెండు గులాబీ పూలను బయటకు తీశాడు మోహనసుందరం. నాకొకటి, ఆ అమ్మాయి కొకటి ఇచ్చాడు.

అట్లా నాలుగడుగులు చీకటివైపు వేసి అదృశ్యమైనాడు.

మోహన సుందరంతో నా పరిచయం అదే. ఆ తరువాత మళ్ళీ అతన్ని చూడలేదు.

* * *

"అప్పుడప్పుడు నా కుడికాలు నన్ను ప్రేమించదు, నాతో సహకరించదు. అలాంటప్పుడు దాన్ని తీసి గోడకు వేలాడదీస్తుంటాను. సాయంకాలం ఆఫీసు నుండి రావటంతోటే, దాన్ని చక్కగా వాష్‌చేసి, ఆయిల్ పూసి, నైసిల్ పౌడరు చల్లి, మళ్ళీ తగిలించుకొంటాను. సాయంకాలాలు ఇదో పెద్ద కార్యక్రమం నాకు. ప్రస్తుతం ఆ పనిమీదే ఉన్నాను."

సాయంకాలం ఆఫీసు తరువాత నేరుగా ఇంటికి రమ్మని కబురు చేశాడు సత్యప్రకాష్. లోపలికి ఆహ్వానిస్తూ చెప్పిన మాటలు ఇవి. లోపలికి నడుస్తుంటే అందమైన పెయింటింగ్‌లు కనువిందు చేశాయి. లక్ష్మణ్, వైకుంఠం, బికేష్, అంజలి ఈలా, జతిన్. ఆయన కోసం ప్రత్యేకంగా వేసిన బొమ్మలు. అల్మరాల్లో, సోఫాలపైనా గుట్టలు గుట్టలుగా పుస్తకాలు. సోఫా దాటి అట్లా బెడ్‌రూమ్‌వైపుకు వెళితే అక్కడా పుస్తకాలే. గోడలపై వేళ్ళాడుతున్న కాళ్ళు, మిలమిలా మెరుస్తూ, చర్మపు రంగులో -

"ముప్పయి యేళ్ళ వయసులో నా కుడికాలు, మోకాలి వరకూ తెగిపోయింది. ఆర్టిఫిషియల్ లింబ్ అవసరమైంది. రకరకాల లింబ్స్ సేకరించాను. వాటితో గొప్పగా ప్రాక్టీస్ చేశాను. చాలామందికి నాకు కాలు లేదనే విషయమే తెలియదు.

"వెరీ సారీ" అంటూ దిగులుగా ఆయన చేతిని పట్టుకొన్నాను.

"ఒక బాంబుదాడిలో నా కాలు పోయింది. శరీరంలోంచి తెగి, అల్లంత దూరంలో రక్తపుముద్దలా ఉన్న నా కాలు, ఇప్పటికీ అదో పీడకలలా, నా కళ్ళ ముందు కదులుతుంటుంది."

"తిరుపతిలో పిహెచ్‌డి చేస్తున్న రోజులు. దసరా సెలవులకు ఇంటికి వెళ్ళాను. ఎన్నికల సీజనది. నాలుగో లోక్‌సభ ఎన్నికలనుకొంటాను. అంతకు ముందు కొన్ని నెలల క్రితం మా తమ్ముడు, ఒకణ్ణి నడిబజారులో నరికి, జైలు కెళ్ళాడు. వాడికి బెయిల్ యిప్పించి ఇంటికి తెస్తుండగా - ఊరి పొలిమేరల్లో మాపై దాడి జరిగింది. మా తమ్ముడు తల చిట్లి అక్కడే చచ్చిపొయ్యాడు. మా అమ్మ కుడి చెయ్యి, నా కాలు తెగిపోయాయి.

"నేను ఇలా రకరకాల లింబ్స్ సేకరించి, వాటిని ప్రేమించి వింత ఓదార్పు పొందుతాను."

"మా అమ్మ మొండి భుజంతో అట్లాగే తిరుగుతానంది. పల్లె వదలి కూడా రానంది."

సత్యప్రకాష్ ముఖంలో తీవ్రమైన ఉద్వేగం. టీ, బిస్కెట్లు తీసుకొని బయట లాన్‌లో కొచ్చి కూర్చున్నాం.

"నీ వ్యాసం నన్నెంతో కదిలించింది. గొప్ప రీసెర్చి అది. రాయలసీమకు మాత్రమే పరిమితమైన ఈ ఫ్యాక్షన్ గ్రూపుల్ని, ఈ హింస రచననీ గొప్పగా ఎనలైజ్ చేశావు. విషవృక్షంలా పెరిగిపోతున్న ఈ ఫ్యాక్షనిజాన్ని, దళిత బిసి కులాల్ని చైతన్యం చేసి, ఉద్యమంగా మార్చి ఫ్యాక్షన్ లీడర్లని ఒంటరివాళ్ళను చేస్తేగానీ, ఈ మహమ్మారి నశించదని - నువ్వు చేసిన ప్రతిపాదన కూడా నాకెంతో నచ్చింది. చాలా ఒరిజినల్‌గా ఉంది ఈ ఆలోచన."

"టాటా మెమోరియల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్సీ ఇన్ జర్నలిజం అవార్డుకు నీ పేరు రికమెండు చేశాను."

ఈడ్చి చెంపపై కొట్టినట్లుగా ఉలిక్కిపడ్డాను. ఆనందం కన్నా దుఃఖాన్ని కలిగించే వార్త. ఈ గౌరవం దక్కాల్సిన వ్యక్తి వేరే ఉన్నాడు. ఇంకా ఈ రహస్యాన్ని ఈయన దగ్గర దాస్తే ఈ అవార్డు నాకో బంగారు శిలువ అవుతుంది.

"ఈ అవార్డు దక్కవలసింది నాకు కాదు."

సత్యప్రకాష్ విసుగ్గా నావైపు చూశాడు.

"ఐయామ్ సారీ. ఇది మోహనసుందరం థీసిస్ లోంచి 'లిఫ్ట్' చేశాను."

"ఎవరీ మోహన సుందరం?"

"కలల్ని అమ్మేవాడు. మనసుల్ని మరమ్మత్తు చేసేవాడు. సైకాలజిస్టు. దళిత ఉద్యమాల నాయకుడు. కవి. ఆశావాది. నిజమైన పోస్ట్-మోడరన్ మానవుడు."

"అవునా?" సత్యప్రకాష్ ఆశ్చర్యపోయాడు.

"మోహన సుందరాన్ని నేను వెంటనే కలవాలి."

"అతన్ని కలవాలంటే అతని ఇంటికే పోదాం. పొయిట్రీ కేఫ్, అతని ఇంటి పేరు. వందలాది, వేలాది కలలు అక్కడ వేలాడుతుంటాయట. పొయిట్రీ కేఫ్‌లో గడపటమంటే మానవుడి ఆత్మకథను చదవటమేనని మిత్రులు చెబుతుంటారు."

"అతని దగ్గరకు చాలామంది పేషెంట్లుగా వస్తుంటారట. వాళ్ళ దుఃఖాల్ని, భయాల్ని పోగొట్టి, మనసుకు రెక్కలు మొలిపిస్తాడట."

అతని గురించి ప్రచారంలో ఉన్న కథలన్నీ సత్యప్రకాష్‌కి చెప్పాను.

"చాలా థ్రిల్‌గా ఉంది. వింటుంటేనే. మనం రేపే అతన్ని కలుద్దాం." సత్యప్రకాష్ ముఖంలో గొప్ప ఆత్రుత.

"నా కాలులాగే, నా తలను కూడా కాసేపు ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరుచుకోవాలనే కోరిక ఒకటుంది నాకు. చూద్దాం. ఈ మోహన సుందరం ఆ అద్భుతం చెయ్యగలడేమో."

నాకు గుడ్‌బై చెబుతూ, చాలా సీరియస్‌గానే తన కోరికను చెప్పాడు సత్యప్రకాష్.

* * *

ఆ మరుసటిరోజు మేం మోహన సుందరాన్ని కలవలేదు. అతను ఇంట్లో లేడు. ఆ తరువాత చాలారోజుల పాటు అతని ఆచూకీ తెలియలేదు.

అక్టోబర్ 25, మోహన సుందరం నేనూ కలిసి బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు తీసుకోవాల్సిన రోజు - నల్లబోర్డర్‌తో అతని ఫొటో వేసి ఎలిజీ రాయాల్సి వచ్చింది. మోహన సుందరాన్ని అతి కిరాతకంగా చంపివేసిన విషయాన్ని మొదటి పేజీలోనే ప్రచురించాం. న్యూస్ కవరేజ్ నేనే చేశాను. ఆ విషాదాన్ని నేనే అక్షరాల్లో అనువదించాను.

*రెక్కలున్న ఒకే ఒక మానవుడి దారుణ హత్య.*

"రాయలసీమ ఫ్యాక్షనిస్టులని పోలీసులంటున్నారు. వేంపెంట మారణకాండకు ఇది కొనసాగింపు అని మరో వాదన. కారణం ఏదైతేనేం. మోహన సుందరం మరణించాడు. మానవుడిలో ఇంత కసి ఉందా అనిపించేలా, అతన్ని చంపివేశారు. కాళ్ళు చేతులు నరికివేసి, తలను మొండెం నుంచి వేరుచేసి, తగలబడుతున్న అతని ఇల్లు పొయిట్రీ కేఫ్‌లోకి ఆ ముక్కల్ని విసిరివేశారు.

మోహన సుందరం రాయలసీమ ఫాక్షనిజానికి వ్యతిరేకంగా దళిత, బిసి కులాల ఐక్యవేదిక తేవాలని కలలు కన్నాడని, ఆ ప్రయత్నంలో ఉండగానే ఈ హత్య జరిగిందని దళిత నాయకులు చెప్పారు.

హింసపై మోహనసుందరం రాసిన వ్యాసానికి సన్మానం ఇవాళే కావటం గొప్ప కాకతాళీయం.

ఈ వార్తపై సత్యప్రకాష్‌గారు ఎందుకో ఎర్రగీతలతో మార్కు చెయ్యలేదు. ఆఫీసుకు సెలవుపెట్టి హడావుడిగా ఇంటికి వెళ్ళారు.

ఆయన కుడికాలు, కొయ్యకాలని ఎందుకో ఆరోజు ఆయన నడకలో స్పష్టంగా తెలుస్తుంది.

*- ఆదివారం ఆంధ్రజ్యోతి, 1 నవంబర్ 1998*